క్లుప్తంగా

నమో ఆంజనేయ



ప్రత్యేక అలంకరణలో ఆంజనేయుడు

పుల్లంపేట : మండల పరిధిలోని కోటగడ్డపై వెలసిన శ్రీ అభయాంజనేయస్వామికి ఆదివారం పూజారి శివశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం కావడంతో చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలు పెద్దఎత్తున ఆలయానికి చేరుకొని స్వామివారిని దర్శించుకొని తమ మొక్కులు చెల్లించుకున్నారు. కోరిన కోర్కెలు తీర్చే దైవంగా అభయాంజనేయస్వామి ప్రసిద్ధి చెందారు.

9న వినాయక ఆలయ వార్షికోత్సవం



వినాయక స్వామి ఆలయం

పెనగలూరు : మండల కేంద్రమైన పెనగలూరు కొత్తపల్లిలో కార్యసిద్ధి వినాయక స్వామి ఆలయ మొదటి వార్షికోత్సవాన్ని ఈనెల 9న ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 9వ తేది ఉదయం అర్చకులు స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. అలాగే మధ్యాహ్నం తలమంచి గిరీష్ రెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. సాయంత్రం వినాయకుడి కల్యాణాన్ని తలమంచి వెంకటరమణారెడ్డి నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు పాల్గొని వినాయక స్వామి ఆశీస్సులు పొందాలని కోరారు.

నల్ల గంగమ్మకు పూజలు



పూజలందుకుంటున్న అమ్మవారు

సంబేపల్లె : మండల కేంద్రంలోని శ్రీ దేవరరాయి నల్లగంగమ్మ ఆలయంలో ఆదివారం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయాన్ని వేపాకులతో శుద్ధి చేశారు. అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చకులు, అభిషేకాలు నిర్వహించారు. పాడిపంటలు పండి రైతులు సుభిక్షంగా ఉండాలని పూజలు చేశారు. చల్లంగ చూడు తల్లీ అని భక్తులు వేడుకున్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొన్నారు.

20 మందికి కంటి ఆపరేషన్లు



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

రాయచోటి టౌన్ : రాయచోటి లయన్స్ కంటి ఆస్పత్రిలో 20 మందికి ఆదివారం కంటి ఆపరేషన్లు చేసినట్లు లయన్ కంటి ఆస్పత్రి చైర్మన్ వైవీ స్వరూపగుప్త తెలిపారు. అలాగే గత వారంలో ఆపరేషన్ చేసిన రోగులకు ఉచితంగా కంటి అద్దాలతో పాటు మందులు కూడా అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చెన్నూరు అన్వర్ బాష, చెన్నముక్కపల్లె మాజీ సర్పంచ్ రాయవరం శ్రీనివాసుల రెడ్డి, కంటి వైద్యులు సురేష్ బాబు, భార్గవి, ఆప్తమాలిస్టు మూలి రాజగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రామాపురం (రాయచోటి జగదాంబసెంటర్) : రామాపురంలోని డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఐదవ తరగతి నుండి ఇంటర్మీడియట్ (ఎంపీసీ, బైపీసీ) వరకు 120 సీట్లు మిగిలి ఉన్నాయని ప్రిన్సిపాల్ రామకృష్ణ తెలిపారు. ఆసక్తి గల ఎస్సీ, ఎస్టీ, బీసీ కేటగిరీ విద్యార్థులు ఈ నెల 8వ తేదీలోపు విద్యార్థి ఆధార్‌కార్డు, కుల ధ్రువీకరణపత్రం తీసుకొని ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలని కోరారు.

సంబేపల్లె : మండల పరిధిలోని దేవపట్ల మిట్ట సమీపంలోని డాక్టర్ బీ.ఆర్ అంబేడ్కర్ పాఠశాలలో విద్యార్థులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మధుమతి ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గురుకుల పాఠశాలలో ఈ ఏడాది 5వ తరగతి నుంచి ఇంటర్ వరకు ఖాళీలున్నామని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఆధార్, కుల, ఆధాయ ధ్రువపత్రాలను తీసుకొని పాఠశాలలో అందజేశాయాలని కోరారు.

లాభాల 'కాలి బాట'..!

- వరిసాగులో కాలిబాటతో ఎంతో ప్రయోజనం
- చీడపీడల నుంచి పంటకు రక్షణ
- రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయాధికారులు



రాయచోటి జగదాంబసెంటర్ : వరిపంట సస్యరక్షణలో కాలి బాటలు ప్రధానమైనవి. పంటకు గాలి, వెలుతురు సక్రమంగా అందించడంలో ఇవి ఉపయోగపడతాయి. దీనివల్ల వరి పిలకలు దుబ్బు చేయడంతోపాటు చీడపీడలనుంచి ఎంతో రక్షణ కలుగుతుంది. అన్నివైపులా ఎరువులు సమానంగా వేయడంతోపాటు సులభంగా పురుగుమందులు పిచికారీ చేయొచ్చు. పంట కోత దశలో అపరాలు జల్లుకోవడంలో కాలి బాటలు ఉపయోగపడతాయి. వరినాట్లు వేసేటప్పుడు మొలకలు దగ్గరగా నాటడం వల్ల తెగుళ్ల వ్యాపించే అవకాశం ఉంది. అందువల్ల నాట్ల సమయంలో కాలిబాటలు వేయడంవల్ల ఎంతో ప్రయోజనం చేకూరుతుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

నాట్లు దగ్గరగా వేయడం వల్ల పంట ఎదిగేటప్పుడు సరైన గాలి తేమ లేకపోతే చీడపీడలకు అనుకూలంగా మారుతుంది. సుడి దోమ ఆశిస్తే చేను పూర్తిగా పాడైపోతుంది. తెగుళ్ల బెడదను తగ్గించుకోవడానికి కాలిబాటలు పాయలు ఎంతగానో ఉపయోగపడతాయి.

రైతుల్లో ఆసక్తి

గతంలో చాలా మంది రైతులు కాలిబాటలు వేయడం అదనపు ఖర్చుగా భావించేవారు. దీనిపై ఆసక్తి చూపించేవారు కాదు. వ్యవసాయాధికారులు కాలిబాటల ప్రయోజనాన్ని రైతులకు విస్తృతంగా వివరించడంతో రైతులంతా కాలిబాటలు వేస్తున్నారు. కాలిబాటలు వేసే సమయంలో రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలి. ప్లాస్టిక్ లేదా డొక్కతాడు తీసుకుని గట్టు అవతలి వైపు నుంచి ఇవతలి వైపు వరకు బాగా సాగదీసి కట్టాలి. తాడు వెంబడి 12 సెంటీమీటర్ల వెడల్పున వరి నాట్లు సాగులో ఉన్న వరిచేను తొలగించి పక్కనే పలుచగా ఉన్న ప్రదేశంలో నాటుకోవాలి. వెదజల్లే పద్ధతిలో సాగు చేస్తే విత్తనాలు చల్లిన తరువాత 15 నుంచి 20 రోజుల వ్యవధిలో కాలిబాటలు వేసుకోవాలి.

లాభాలెన్నో..

కాలిబాట వేయడంతో వేరు మొదళ్లకు గాలి, వెలుతురు, సూర్యరశ్మి విస్తారంగా తగులుతుంది. దీంతో పైరు ఆరోగ్యంగా ఎదుగుతుంది. చీడపీడల బెడద కొంతవరకు తగ్గుతుంది. కాలిబాట మార్గంలో వెళ్లి కలుపు తొలగించడానికి, మందులు చల్లడానికి వీలు కలుగుతుంది. తెగుళ్లను సులభంగా గుర్తించడానికి, సస్యరక్షణ చర్యలు తీసుకోవడానికి ఎలుకలను నివారణకు వీలవుతుంది. తుఫాన్లు, భారీ వర్షాలు వంటి ప్రకృతి విపత్తులు ఏర్పడిన సమయంలో పైరులో కిరణజన్య సంయోగ క్రియ సమర్థవంతంగా జరిగి దిగుబడి తగ్గకుండా ఉంటుంది. పైరులో చీడపీడల ఉధృతిని దగ్గరగా గమనించి, దానికి అనుగుణంగా సకాలంలో సస్యరక్షణ చర్యలు తీసుకోవడానికి వీలువుతుంది. కాలిబాటల వెంట నడిచి ఎరువులు వేస్తే పొలం అంతా సమానంగా పడుతుంది. తగిన గాలి వెలుతురు, సూర్యరశ్మి అవసరం. కిరణజన్య సంయోగ క్రియ బాగా జరిగి మొక్కలో పత్రహరితం అధికంగా ఉత్పత్తి అవుతుంది.

అవగాహన కల్పిస్తున్నాం



ఒక ఎకరా పొలంలో కాలిబాటలు వేయడానికి సుమారు రూ.800 ఖర్చు అవుతుంది. కానీ కాలిబాటలు వేయడం వల్ల నాలుగు బస్తాల వరకు అధిక దిగుబడి రావడమే కాకుండా పంట కాలంలో చేను మొత్తం తిరగడానికి అనువుగా ఉంటుంది. దీనిపై మా సిబ్బందితో రైతులకు అవగాహన కల్పించడంతో ఇప్పుడు రైతులంతా కాలిబాటలు వేస్తున్నారు.

– నాగమణి, వ్యవసాయాధికారి, రామాపురం

సీఐటీయూ మహాసభలు జయప్రదం చేయండి



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు ఏవీ నాగేశ్వరరావు

రాయచోటి : వైజాగ్‌లో ఐదురోజులపాటు జరగనున్న సీఐటీయూ అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆదివారం రాయచోటిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రం ప్రభుత్వం కార్మికులకు నష్టం చేసే విధానాలను అవలంభిస్తోందని, సంపదనంతా కార్పొరేట్ శక్తులకు దోచి పెడుతోందని ఆరోపించారు. అందులో భాగంగా 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్‌గా తీసుకువచ్చిందన్నారు. లేబర్ కోడ్స్ అమలు జరిగితే కార్మికులకు సమ్మె చేసే హక్కు, సంఘం పెట్టుకునే హక్కు, జీతభత్యాలు బేరం ఆడుకునే ప్రాథమికమైన హక్కులు కోల్పోతారని చెప్పారు. లేబర్ కోడ్స్ రద్దు అయ్యే వరకు పోరాటాన్ని ఆపేది లేదని స్పష్టం చేశారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలను నిలువుదోపిడీ చేస్తున్నారని మండిపడ్డారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తెస్తున్న లేబర్ కోడ్‌లకు అనుగుణంగానే రాష్ట్ర ప్రభుత్వం కార్మిక చట్టాలలో మార్పులు చేసిందన్నారు. మార్పు చేసిన చట్టాలను వెంటనే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ రామాంజులు, జిల్లా ఉపాధ్యక్షుడు ఏవీ రమణ, శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి డి. భాగ్యలక్ష్మీ, శ్రీలక్ష్మీ, వెంకట్రామయ్య, మొహరాజున్నీషా, రవికుమార్, ఓబులమ్మ, సురేంద్ర, రెడ్డప్ప పాల్గొన్నారు.

ఆశాల సమస్యలు పరిష్కరించాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న యూనియన్ నాయకులు

రైల్వేకోడూరు అర్బన్ : ఆశావర్కర్ల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘం అధ్యక్షురాలు సుబాషిణి కోరారు. ఈనెల 30, 31న కడప నగరంలో జరిగే ఏఐటీయూసీ రాష్ట్ర ఆశా వర్కర్స్ మూడవ మహాసభలను విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. మహా సభలకు సంబధించిన కరపత్రాలను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 17 సంవత్సరాలుగా ఆశావర్కర్ల సమస్యలపై పోరాడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు గంగాధర్, గుంటి వేణుగోపాల్, రత్నకుమారి, రాజమ్మ, భాగ్యమ్మ పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ప్రశాంతత



మాట్లాడుతున్న డీవైఈఓ లోకేశ్వర్‌రెడ్డి

పీలేరురూరల్ : విద్యా రంగంలో నిరంతరం బోధనలో నిమగ్నమై ఉంటున్న ఉపాధ్యాయులకు క్రీడలతో మానసిక ప్రశాంతత లభిస్తుందని డీవైఈఓ లోకేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో క్రీడోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్రీడలతో మానసిక ప్రశాంత, శారీరక ధృడత్వం పెరుగుతుందని తెలిపారు. జిల్లా యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరిప్రసాద్, జాబీర్ మాట్లాడుతూ ఆగష్టు 10న యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి ఏటా క్రీడాపోటీలు నిర్వహించడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు సుధాకర్‌నాయుడు, ట్రెజరర్ చంద్రశేఖర్, కార్యదర్శులు అక్రంబాష, రమణమూర్తి, నాయకులు సుధాకర్, చంద్రశేఖర్, నరసరాజు, వెంకటరమణ, విజయకుమార్, రాజు, జోహర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా వీరభద్రస్వామి విగ్రహప్రతిష్ట



హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

తంబళ్లపల్లె: మండలంలోని కన్నెమడుగు పంచాయతీ చిన్నమాచిరెడ్డిగారిపల్లెలో నూతనంగా నిర్మించిన ఆలయంలో రెండు రోజులుగా శ్రీవీరభద్ర స్వామి విగ్రహ ప్రాణప్రతిష్ఠ, కుంభాభిషేక మహోత్సవం వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం ఉదయం వేదపండితులు శాస్త్రోక్తంగా వినాయకుని పూజ, పుణ్యాహవాచనం, పంచగవ్యం, యాగశాల పూజ, రెండవ కాల హోమం, గణపతి,లక్ష్మి, నవగ్రహ హోమం, రుద్రహోమం, పుణ్యాహుతి, మంగళ హారతితో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం వినాయకుని పూజ, పుణ్యాహవాచనం, యజమాన సంకల్పం, పంచగవ్యం,అష్టబంధనస్థాపనం నిర్వహించారు. సోమవారం ప్రాణప్రతిష్ఠ కార్యక్రమంలో మహాకుంభాభిషేకం నిర్వహిస్తారని కన్నెమడుగు దాయాదులు,గ్రామ ప్రజలు తెలిపారు. ఆలయాన్ని విద్యుత్‌దీపాలతో సర్వాంగసుందరంగా అలంకరించారు. మూడు రోజుల పాటు అన్నసంతర్పరణ నిర్వహిస్తున్నారు.

ప్రజల పక్షాన పోరాడితే నిర్బంధమా



సభలో మాట్లాడుతున్న నరసింహులు

బి.కొత్తకోట: ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై ప్రజల పక్షాన పోరాడితే నిర్బంధిస్తారా అని సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్.నరసింహులు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఆదివారం బి.కొత్తకోట సీపీఐ నియోజకవర్గ ఆరవ మహాసభను నిర్వహించారు. షాదీమహల్‌లో జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ సంస్థల కొమ్ముకాస్తున్నాయని అన్నారు. పెట్టుబడిదారుల కోసం పేదల భూములను కొల్లగొట్టి ధారాదత్తం చేస్తున్నారన్నారు. రైతుల ఆత్మహత్యలను నివారించడంలో, కార్మికుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని అన్నారు. కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీల పెంపు, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిస్తూ ఉద్యమాలను చేపడుతున్నామన్నారు. కాగా సభ నిర్వహణకు ముందుకు జ్యోతిచౌక్‌లో సీపీఐ జెండాను ఏగురవేశారు. అక్కడినుంచి కార్మికులు, పార్టీ శ్రేణులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మనోహర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు కృష్ణప్ప, సాంబశివ, మురళి, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మాధవ్, హరికుమార్, కే.అంజనప్ప, బషీర్‌ఖాన్, రఘునాధ్, సలీంబాషా, అష్రఫ లీ, తంబయ్యశెట్టి, వేణుగోపాల్, నిజాముద్దీన్, అమరావతి, నారాయణస్వామి, రియాజ్ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

లక్కిరెడ్డిపల్లి : మానవతా స్వచ్ఛంద సేవాసంస్థ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ముఖ్య అతిథులుగా చైర్మన్ బాలసుబ్రహ్మణ్యం, కేంద్ర కమిటీ సభ్యుడు వై. ప్రసాద్ యాదవ్ పాల్గొన్నారు. అనంతరం ప్రసాద్ యాదవ్ మాట్లాడుతూ మానవతా స్వచ్ఛంద సేవాసంస్థ సేవలు అభినందనీయమని కొనియాడారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 115 మండలాల్లో మానవతా స్వచ్ఛంద సేవాసంస్థలు పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నారని తెలిపారు. బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ మానవత స్వచ్ఛంద సంస్థ సభ్యులు పేద ప్రజలకు అండగా నిలిస్తున్నారని ప్రశంసించారు. అంతేకాకుండా భవిష్యత్తులో కూడా సంస్థ మంచి సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సీఏ విద్యార్థి జి వెంకటరమణకు రూ. 20 వేల నగదును సంస్థ ద్వారా అందజేశారు. నూతన కార్యవర్గం అధ్యక్షుడిగా టి. ఉమాపతిరెడ్డి, కార్యదర్శి వీరనాగిరెడ్డి, కోశాధికారి పి రవిశంకర్, జాయింట్ సెక్రటరీ ఎల్ ఓబులేసుతోపాటు కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పకీరయ్య, రాజారెడ్డి, మానవతా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ఎన్జీఓ ఎన్నికలు ఏకగ్రీవం

కడప రూరల్ : ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ సిద్దవటం తాలూకా యూనిట్ ఎన్నికలు ఆదివారం ఏకగ్రీవంగా జరిగాయి. అధ్యక్షుడిగా జె.సుబ్బరాయుడు, సహ అధ్యక్షుడిగా వై.ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఎల్.యానాదయ్య, పి.భాస్కర్‌రెడ్డి, శారద, కె.పవన్ కుమార్, కార్యదర్శిగా సి.హైమావతి, జాయింట్ సెక్రటరీలుగా అంజనమ్మ, సల్మాన్‌రాజు, లక్ష్మినరసింహ, వెంకట రమణ, కోశాధికారిగా నాగేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా తిమ్మారెడ్డి, సహాయ ఎన్నికల అధికారి పోల్ రెడ్డి, పరిశీలకులుగా రవికుమార్ వ్యవహరించారు. ముఖ్య అతిథులుగా హాజరైన శ్రీనివాసులు నూతన కార్యవర్గం చేత ప్రమాణ స్వీకారం చేయించారు.

మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ



శిక్షణా పరికరాలు అందజేస్తున్న ఎస్ఐ శోభ

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని గ్లోబల్ ట్రస్ట్ చైర్మన్ పార్థసారధి ఆధ్వర్యంలో స్నేహితుల దినోత్సవం సందర్భంగా సిద్దార్థ్ జ్ఞాపకార్థం మహిళలకు ఆదివారం ఉచిత టైలరింగ్ శిక్షణను ప్రొహిబిషన్ ఎస్ఐ శోభ ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ స్నేహితుడి గుర్తు పెట్టుకొని ఆయన జ్ఞాపకార్థం సామాజిక సేవలు చేయడం మంచి పరిణామమని కొనియాడారు. మహిళలు స్వశక్తితో ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం మహిళలకు శిక్షణా పరికరాలు అందించారు. ఈ కార్యక్రమంలో మహిళలు పాల్గొన్నారు.

ఎంపీ మిథున్‌రెడ్డికి బెయిల్ రావాలని పూజలు



అమ్మవారి ఆలయం ఎదుట వైఎస్సార్‌సీపీ నాయకులు



కడప పెద్ద దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ మైనార్టీ నేతలు

గాలివీడు : అక్రమ కేసులో అరెస్టు అయిన రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డికి త్వరగా బెయిల్ మంజూరు కావాలని నూలివీడు గ్రామ దేవత రేణుకా ఎల్లమ్మ తల్లికి సర్పంచ్ ఉమాపతిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులపై కక్షతో అక్రమ కేసులు బనాయించడం సమంజసం కాదన్నారు. అనంతరం అమ్మవారికి పాడిపంటలు పండి రైతులు సుభిక్షంగా ఉండాలని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ అమానుల్లా, వైఎస్సార్సీపీ నాయకులు రాజగోపాల్ రెడ్డి, సోషియల్ మీడియా కన్వీనర్ జల్లా మల్‌రెడ్డి, రంగంరెడ్డి రామాంజులురెడ్డి, బీసీ నాయకులు యల్లప్ప, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటరమణారెడ్డి, మైనారిటీ నాయకులు వేంపల్లి సమీర్, భారీగా వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

రాయచోటి జగదాంబసెంటర్ : అక్రమంగా అరెస్టు చేసిన ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డికి బెయిల్ మంజూరు కావాలని కడపలోని అమీన్‌పీర్ పెద్ద దర్గాలో రాయచోటికి చెందిన వైఎస్సార్‌సీపీ నేతలు ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అన్నమయ్య జిల్లా వైస్సార్‌సీపీ మైనార్టీ అధ్యక్షులు బేపారి మహమ్మద్‌ఖాన్, మైనార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరూన్‌బాషా, కౌన్సిలర్ షబ్బీర్, అసద్, జబీవుల్లా, బేపారి అసద్‌ఖాన్ పాల్గొన్నారు.

బాబు మోసాలను ఎండగడుదాం

రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి

ఒంటిమిట్ట: ఎన్నికల ముందు చంద్రబాబు హామీలిచ్చి, అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయకుండా చేస్తున్న మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నమయ్య జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి పిలుపునిచ్చారు. చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ.. నీటి మూటలేనని ఎద్దేవాచేశారు. ఆదివారం మండల పరిధిలోని పెన్నపేరూరు గ్రామంలో ''బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ'' కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ఆకేపాటి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు చేస్తున్న మోసాలను వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇది ప్రజలకు మేలు చేసే ప్రభుత్వం కాదని, రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నారని మండిపడ్డారు. కూటమి నాయకులు రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక హత్యా రాజకీయాలు ఎక్కువయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ మోసాలను ప్రశ్నింస్తున్నా వారిపై తప్పుడు కేసులు బనాయించి చిత్రహింసలకు గురిచేస్తున్నారని తెలిపారు. ఈ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలంటే రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించుకుని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మేకపాటి నందకిశోర్‌రెడ్డి, దొగ్గల మధుసూదన్‌రెడ్డి, గజ్జల నారపురెడ్డి, హరిప్రసాద్‌రెడ్డి, సాలాబాదు ఉప సర్పంచ్ వెంకటేష్ రెడ్డి, రాజమోహన్‌నాయుడు, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసులరెడ్డి, వెంకటకృష్ణారెడ్డి, మనోహర్‌రెడ్డి, రవిరాజు, మురళీ, గంగిరెడ్డి, శేషారెడ్డి, పాలెం పాండురంగారెడ్డి, బ్రహ్మానంద రెడ్డి, ఎరికలరెడ్డి, లక్ష్మీరెడ్డి, రవిరెడ్డి, ముస్లిం మైనారిటీ నాయకులు జాకీర్ హుసేన్, కడప బాషా, వైఎస్సార్‌సీపీ ఒంటిమిట్ట మండల అధ్యక్షుడు టక్కోలు శివారెడ్డి, రాష్ట్ర మాజీ డైరెక్టర్ ఆకేపాటి వేణుగోపాల్ రెడ్డి, ఎంపీటీసీ ముమ్మడి నారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి నరసింహులు

లక్కిరెడ్డిపల్లి : ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం చేస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు తెలిపారు. ఆదివారం లక్కిరెడ్డిపల్లి స్థానిక పార్టీ కార్యాలయంలో మండల ఐదవ మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 11, 12వ తేదీల్లో మదనపల్లిలో జరిగే జిల్లా మహాసభలకు కార్మికులు, కర్షకులు, పార్టీ కార్యకర్తలు సానుభూతిపరులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అన్నమయ్య జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం పదివేల కోట్ల రూపాయల నిధులు కేటాయించేంత వరకు నిరంతర పోరాడుతామని ప్రకటించారు. అనంతరం సీపీఐ లక్కిరెడ్డిపల్లి మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. సీపీఐ మండల కార్యదర్శిగా ఓబులేసు, సహాయ కార్యదర్శులుగా జగదీష్, రాధాకృష్ణ, మండల కార్యవర్గ సభ్యులుగా గిరినాథరెడ్డి, సురేష్ బాబు, మహబూబ్ బాషా, నాగరాజు, గణేష్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

రాయచోటి : జెడ్పీ మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నేత సుగవాసి బాలసుబ్రహ్మణ్యం జన్మదిన వేడుకలను ఆదివారం రామాపురం మండలం బండపల్లి ప్రేమాలయంలో ఘనంగా నిర్వహించారు. సందర్భంగా ప్రేమాలయంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అలాగే రాయచోటిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఘనంగా జరుపుకున్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షులు అమరనాథరెడ్డిలు ఫోన్ ద్వారా బాలసుబ్రహ్మణ్యంకు శుభాకాంక్షలు తెలిపారు. లక్కిరెడ్డిపల్లె ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, రాయచోటి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ హరూన్‌బాషా, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు బాలసుబ్రహ్మణ్యంను కలసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.

లక్కిరెడ్డిపల్లి: ఉమ్మడి కడప జిల్లా పరిషత్ మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నాయకులు సుగవాసి బాలసుబ్రహ్మణ్యం పుట్టినరోజు వేడుకలు ఆదివారం రాయచోటి సుగవాసి వారి కార్యాలయంలో అన్నమయ్య జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షులు మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఉద్యోగుల ఆర్థిక విషయాలపై ఉద్యమిస్తాం

కడప ఎడ్యుకేషన్: ప్రభుత్వం నుంచి రావాల్సిన ఆర్థిక విషయాలపై ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందని ఆంధ్ర ప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం(ఆపస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేల్పుల రామాంజనేయ ప్రసాద్ అన్నారు. కడప పట్టణంలోని నాగార్జున మహిళ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జిల్లా శాఖ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.25 వేల కోట్లకు పైగా ఆర్థిక బకాయిల విడుదల, ఐదు పెండింగ్ డీఏల విడుదల, పీఆర్సీ కమిషన్ వేసి మధ్యంతర భృతిపై ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలను కలుపుకొని ఉద్యమిస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్ల బకాయిలపై ఎలాంటి స్పందన లేకపోవడం ఆందోళనకరం అన్నారు. 12వ వేతన సవరణకు సంబంధించి వెంటనే సిట్టింగ్ జడ్జితో కమిషన్ ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా అధ్యక్షుడు శెట్టెం చెన్నయ్య మాట్లాడుతూ విద్యాశాఖ వింత పోకడలతో నడుస్తుందన్నారు. ఐచ్చిక సెలవులను ఎప్పుడూ లేనివిధంగా వ్యక్తిగతంగా వాడుకోవాలనడం, మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్‌లో ఇతర డిపార్టుమెంట్ అధికారుల జోక్యం కల్పించడం తగదని హితవుపలికారు.

కుక్కల బెడద.. కోతులతో దడ



ఇంటి వద్ద తిష్ట వేసిన కోతులు



వీధుల్లో సంచరిస్తున్న కుక్కలు

- భయపెడుతున్న వానరాలు
- హడలెత్తిస్తున్న శునకాలు

సిద్దవటం : సిద్దవటంలో కోతులు కుక్కల బెడద అధికంగా ఉంది. ప్రజలు బయటకు రావాలంటే భయబ్రాంతులకు గురవుతున్నారు. వివిధ పనుల నిమిత్తం బయటకు రావాలన్నా, పోవాలన్నా కుక్కలు, కోతులు దాడి చేస్తాయని బెదిరిపోతున్నారు. ఒకటి రెండు కాదు పదుల సంఖ్యలో వీధులలో తిరుగుతూ ప్రజలపైకి దూకుతున్నా . దీంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అటవీ ప్రాంతాల్లో ఉండాల్సిన కోతులు నివాస ప్రాంతాలకు వచ్చి గృహాలను గుల్ల చేస్తున్నాయి. ఒక వైపు కోతుల బెడద అయితే మరో వైపు కుక్కల గుంపు తోడైంది.

పెరుగుతున్న బాధితులు

కుక్కలు కూడ పదుల సంఖ్యలో భౌ..భౌ.. అంటూ ప్రజలను పరుగులు పెట్టిస్తున్నాయి. ఇప్పటికే పలు ప్రాంతాల్లో కుక్క దాడిలో ప్రాణాలు, గాయాలైన ఘటనలు అనేకం ఉన్నాయి. ఈ రెండు జంతువుల ఆగడాలకు అడ్డుకట్టవేయలేని పరిస్థితులు వచ్చాయి. గ్రామ పంచాయతీ అధికారులు పట్టించుకోలేదని బాధితులు ఆరోపిస్తున్నారు. గతంలో కోతులను, కుక్కలను పట్టుకునేవారు వచ్చినప్పటికీ అధికారుల మధ్య ధర కుదరలేదని కోతులు పట్టేవారు వెళ్లిపోయారు. దీంతో వాటి సంతతి రోజురోజుకు పెరిగిపోతోంది. గ్రామంలో రాత్రి, పగలు అని తేడా లేకుండా రోడ్లపై కుక్కలు స్వైర్వ విహారం చేస్తున్నాయి. ఎవరైనా కొత్త వ్యక్తులు కనిపిస్తే వారిని కరుస్తున్నాయి. కోతుల, కుక్కల బాధితులు రోజురోజుకు పెరిగిపోతున్నారు. అధికారులు స్పందించి కోతులను, కుక్కలను పట్టుకొని అటవీ ప్రాంతాల్లో వదిలేయాలని ప్రజలు కోరుతున్నారు.